సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 17 । ఫిబ్రవరి । 2025



రూల్స్‌కు తిలోదకాలు

జీసీ సంక్షేమ శాఖలో నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. ముడుపుల ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- 8లో



ఆదిత్యుని సన్నిధిలో..

ఆదిత్యుని సన్నిధిలో మాఘమాస సందడి కనిపించింది. పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు.

- 8లో



జయహో.. రాజమ్మ తల్లి

వత్సవలస రాజమ్మ తల్లి రెండో వారం యాత్ర ఘనంగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు.

న్యూస్‌రీల్

'ఆదిత్యుడిని తలచుకున్నాకే పాట'



ఆదిత్యుని జ్ఞాపికను సునీతకు అందజేస్తున్న ఈఓ భద్రాజీ, శంకరశర్మలు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని నిత్యం తలచుకున్నాకే తన గీతాలాపన ప్రారంభమవుతుందని సినీ గాయని సునీత అన్నారు. ఆదివారం ప్రత్యేకంగా ఆమె సూర్యనారాయణ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. స్వామి ప్రసాదించిన ఆరోగ్యంతోనే గత రెండు దశాబ్దాలుగా సినీ రంగంలో పాటలు పాడుతున్నానన్నారు. తన కెరీర్‌లో 9 నంది అవార్డులతో పాటు రెండు ఫిల్మ్ ఫేర్ అవార్డులు రావడంతో పాటు అన్ని ప్రాంతాల ప్రేక్షకుల్లో గుర్తింపు రావడం నిజంగా తన అదృష్టమన్నారు. అంతకుముందు సూర్యనమస్కారాల పూజలను తిలకించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదాశీర్వచనాన్ని అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వై.భద్రాజీ తదితరులు పాల్గొన్నారు.

'థర్మల్ ప్లాంట్‌తో అభివృద్ధి బూటకమే'



గిరిజనులతో మాట్లాడుతున్న థర్మల్ పోరాట కమిటీ ప్రతినిధులు

సరుబుజ్జిలి: థర్మల్ ప్లాంట్ నిర్మించడం వల్ల అభివృద్ధి జరుగుతుందని చెప్పడం అంతా బూటకమని తెలుగు రాష్ట్రాల మానవ హక్కుల వేదిక కన్వీనర్ వీఎస్ కృష్ణ తెలిపారు. ఆదివారం థర్మల్ ప్లాంట్ ప్రతిపాదిత గ్రామాలైన వెన్నెలవలస, మసాన్‌పుట్టి, బొడ్లపాడు, తిమడాం, జంగాలపాడు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజనులతో సమావేశం నిర్వహించారు. పచ్చని పంటపొలాల్లో థర్మల్ ప్లాంట్ నిర్మాణ ఆలోచనలు తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. థర్మల్ ప్లాంట్ నిర్మాణం వల్ల వందలాది ఎకరాల పంట భూములతోపాటు, మానవాళి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని గుర్తు చేశారు. ప్రపంచ దేశాలు 2050 నాటికి థర్మల్ ప్లాంట్లు మూసివేయడానికి నిర్ణయాలు తీసుకుంటున్న తరుణంలో కొత్తగా ఈ ప్రాంతంలో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రాబోయే ప్రమాదాన్ని ముందుగానే అరికట్టి, భావితరాల భవిష్యత్‌ను కాపాడుకోవాలంటే పవర్‌ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదన విరమించేవరకు కలసికట్టుగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో మానవహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేవీ జగన్నాథం, ప్రసూనకర్త అనురాధ, జిల్లా కార్యదర్శి సురేష్, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు చౌదరి లక్ష్మణరావు, ఆదివాసీ సంక్షేమపరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి, న్యూ డెమొక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వంకల మాధవరావు, థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు సురేష్‌దొర, కార్యదర్శి అత్తులూరి రవికాంత్, కోశాధికారి సింహాచలం పాల్గొన్నారు.

అంధకారంలో మార్చురీ



అంధకారంలో ఉన్న టెక్కలి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ విభాగం

టెక్కలి: టెక్కలి జిల్లా ఆస్పత్రికి చెందిన మార్చురీ విభాగం సుమారు నెల రోజులుగా అంధకారంలో ఉంది. పాత ఆస్పత్రికి ఆనుకుని ఉన్న మార్చురీ విభాగానికి చెందిన విద్యుత్ సరఫరా వైర్లను నెల రోజుల కిందట దుండగులు చోరీ చేశారు. దీంతో అప్పటి నుంచి ఈ విభాగానికి విద్యుత్ సరఫరా లేకపోవడం విస్మయానికి గురి చేస్తోంది. ఇక్కడ రెండు ఫ్రీజర్లు ఉన్నప్పటికీ ఒక్కటి మాత్రమే పనిచేస్తోంది. అయితే దానికి సైతం విద్యుత్ సరఫరా లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో చీకటి పడిన తర్వాత తీసుకువచ్చిన మృతదేహాలను భద్రపరచడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటీవల కాలంలో తీసుకువచ్చిన మృతదేహాలతో పాటు కుటుంబ సభ్యులు రేయింబవళ్లు చీకట్లోనే పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది. అధికారులు స్పందించి మార్చురీ విభాగానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

లంచావతారంపై ఆరా

తనిఖీలతో ఆగిన లారీలు



- జిల్లాలోని ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై ఉన్నతాధికారులు సీరియస్
- అక్రమ రవాణాను క్యాష్ చేసుకున్న అధికారిపైనే ప్రధానంగా ఫోకస్
- సంబంధం ఉన్న శాఖలకు చెందిన కొందరికి నోటీసులు జారీ చేసినట్టు సమాచారం
- అధికారికి లారీకి రూ. 2వేలు చొప్పున ముడుతున్నట్టు భోగట్టా

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

జిల్లా నుంచి అక్రమ ఇసుకను దగ్గరుండి సరిహద్దులు దాటిస్తున్న 'లంచావతారం'పై నిఘా వర్గాలు ఆరా తీస్తున్నాయి. సెలవు రోజైనా ఆదివారం కూడా ఇదే విషయమై దృష్టి పెట్టినట్టు సమాచారం. ఈ అధికారి ఒక్కో లారీకి రూ.రెండేసి వేల చొప్పున వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ర్యాంపులో ఇసుక ఎత్తినందుకు రూ.వెయ్యి, అక్రమ రవాణా చేసినందుకు రూ.వెయ్యి వసూలు చేసి లబ్ధిపొందుతున్నట్టు సమాచారం. జరుగుతున్న భాగోతంపై 'సాక్షి'లో కథనం వచ్చాక విస్తృతంగా చర్చకు దారితీసింది.



అధికారిక ర్యాంపులు ఏడే..

జిల్లాలో అధికారికంగా 11 ఇసుక ర్యాంపులు నడిచేవి. ఇందులో రీచ్‌లతో పాటు డీ సిల్టేషన్ ర్యాంపులున్నాయి. వీటిలో గార, ముద్దాడపేట, కాఖండ్యాం, బట్టేరు రీచ్‌లకిచ్చిన ఏడాది గడువు ముగిసింది. దీంతో అధికారికంగా నడుస్తున్నవి ఏడు రీచ్‌లే. కానీ, గడువు తీరిన రీచ్‌లతో పాటు అనధికారికంగా వంశధార, నాగావళి నదీ తీరం పొడవునా ఎక్కడికక్కడ అధికార పార్టీ నేతల కనుసన్నల్లో ఇసుక ర్యాంపులు నడుస్తున్నాయి. మంచినీటి ఇన్‌ఫిల్టరేషన్ బావులు, సంపులు, వంతెనలు ఉన్న చోట కూడా ఇసుక తవ్వేసి తరలించేస్తున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో దూసి, ఇసుకలపేట, దిబ్బలపేట, తొగరాం, కొత్తవలస, నిమ్మతొర్లాడ, పాతూరు, నారాయణపురం, అక్కివరం, బెలమం, లొద్దలపేట, కొరపాం, తోటాడ, సింగూరు, చెవ్వాకులపేట, సవలాపురం, శ్రీకాకుళం నియోజకవర్గంలోని బైరి, కరజాడ, బూరవల్లి, కళ్లేపల్లి, కిల్లిపాలెం, పొన్నాం, బట్టేరు, నైరా, గార, నరసన్నపేట నియోజకవర్గంలోని మడపాం, పర్లాం, రామకృష్ణాపురం, శ్రీముఖలింగం, దొంపాక, లుకలాం, బుచ్చిపేట, ఉర్లాం, చేనులవలస, గోపాలపెంట, పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు, హిరమండలం మండలాల్లోని పలు గ్రామాల నదీ తీరంలో అక్రమంగా ఇసుక ర్యాంపులు నడిచాయి. దీంతో పాటు గడువు ముగిసిన గార, బట్టేరు, కాఖండ్యాం, ముద్దాడపేట రీచ్‌ల్లో కూడా అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఇటీవల కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు వెళ్లి తనిఖీలు చేయడంతో వాటిలో కాస్త తవ్వకాలు ఆగాయి. రాత్రి పూట మాత్రం యథాతథంగా సాగిపోతున్నాయి.

అనధికార ర్యాంపుల్లో ప్రభుత్వం నిర్దేశించిన ధర కన్న 10టైర్ల లారీకి రూ. 12వేలు, 12టైర్ల లారీకి రూ. 14వేలు, 14టైర్ల లారీకి రూ. 16వేలు, 16టైర్ల లారీకి రూ. 18వేలు చొప్పున అదనంగా వసూలు చేస్తున్నారు. ఇదే విషయమై కలెక్టర్ గ్రీవెన్స్‌కు గతంలో ఫిర్యాదులు కూడా వచ్చాయి. ఇలా మొత్తం తిలాపాపం.. తలా పిడికెడు అన్నట్టుగా అక్రమ తవ్వకాలు, తరలింపులో నాయకులతో పాటు పలువురు భాగస్వామ్యం కావడంతో అక్రమ సొమ్ముకు కక్కుర్తిపడే అధికారులకు పంట పండింది.

క్యాష్ చేసుకున్న ఆ అధికారి

అక్రమ రవాణా అరికట్టేందుకు కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి రణస్థలం మండలం పైడి భీమవరం సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. అక్కడ ప్రత్యేక దళాలకు చెందిన సిబ్బందిని తనిఖీల కోసం నియమించారు. అయినప్పటికీ అక్రమ రవాణా ఆగలేదు. ముఖ్యంగా రాత్రిపూట ఎక్కువగా అక్రమ రవాణా సాగుతోంది. ఇక ఉదయం నకిలీ బిల్లుల సాయంతో వందలాది లారీలు జిల్లా దాటేస్తున్నాయి. ఇదే అవకాశంగా తీసుకుని లంచావతారం ఎత్తిన ఓ అధికారి క్యాష్ చేసుకుంటున్నారు.



సరిహద్దుల్లో లంచావతారం

సాక్షిలో ప్రచురితమైన కథనం

అక్రమార్కులతో అధికారికి లింకులు

విశాఖకు చెందిన లారీ యజమానులతో పాటు అనధికార ర్యాంపులు నిర్వహిస్తున్న నిర్వాహకులతో డీల్ కుదుర్చుకుని పథకం ప్రకారం జిల్లా నుంచి ఇసుకను తరలించేస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో ఇచ్ఛాపురానికి చెందిన ఓ లారీ యజమాని విశాఖలో ఉంటూ ఆయనకు బాగా సహకరిస్తున్నారు. ఆ యజమానికి సొంతంగా 13లారీలు ఉండటం, ఆ వ్యక్తికి లంచావతారమెత్తిన అధికారికి సన్నిహిత సంబంధాలుండటంతో ఈ యజమాని మరికొంతమంది లారీ యజమానులతో ఒప్పందం కుదిర్చి జిల్లా నుంచి ఇసుకను తరలించేస్తున్నారు. ఇసుక కొరత ఉన్న మొదట్లో లారీకి రూ. 3వేల నుంచి రూ. 5వేల వరకు ముడుపులు తీసుకోగా, ప్రస్తుతం లారీకి రూ. 2వేలు చొప్పున తీసుకుంటున్నట్టుగా సమాచారం. ఇందులో సగం అక్రమ ర్యాంపుల నిర్వాహకుల నుంచి వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

రికార్డెడ్‌గా రోజుకి 150నుంచి 180వరకు లారీలు తరలివెళ్తున్నట్టు తెలిసింది. అనధికారికంగా ఎన్ని లారీలు వెళ్తున్నాయో యజమానులకే తెలియాలి. ఇలా, రికార్డయిన అయిన లారీలను జాయింట్ కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేసేసరికి 28 లారీల్లో 12లారీలు నకిలీ బిల్లులతో తరలిస్తున్నట్టుగా గుట్టు రట్టు అయింది. సరిహద్దు చెక్‌పోస్టుల్లో తనిఖీ చేస్తున్న విషయం తెలుసుకుని దానికి ముందు కొంత దూరంలో 50వరకు లారీలు చాలా సేపు నిలిచిపోయాయి. ఆ తర్వాత రణస్థలం, సతివాడ, రామతీర్థం మీదుగా మళ్లించేశారు. ప్రస్తుతం కూడా ఈ రూట్‌లోనే అక్రమ రవాణా సాగుతోంది.

ఉన్నతాధికారి ఆరా

జిల్లాలో జరుగుతున్న అక్రమ తవ్వకాలు, అక్రమ రవాణా, నకిలీ బిల్లులపై జిల్లా ఉన్నతాధికారి సీరియస్‌గా దృష్టిసారించారు. ముఖ్యంగా సరిహద్దులో లంచావతారం ఎత్తిన అధికారి కోసం ప్రత్యేకంగా ఆరా తీసినట్టు తెలిసింది. ఎవరా అధికారి అని నిఘా వర్గాల ద్వారానే వివిధ మార్గాల్లో తెలుసుకుంటున్నట్టు సమాచారం. ఇసుక వ్యవహారంలో సంబంధం ఉన్న శాఖలకు చెందిన కొందరికి నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది.

నేటి నుంచి వాసుదేవుని బ్రహ్మోత్సవాలు



మందసలో పురాతన ఆలయం



పూజలందుకుంటున్న వాసుదేవ పెరుమాళ్లు

కాశీబుగ్గ: మందస పట్టణంలో కొలువైన వాసుదేవుని 16వ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 23 వరకు ఉత్సవాలు జరుగుతాయి. 14వ శతాబ్దానికి చెందిన ఈ ఆలయంలో రాజుల కాలం నుంచి ఏటా బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. 1744 సంవత్సరంలో నరసాపురానికి చెందిన తెలికిచెర్ల కందాడ రామానుజాచార్యస్వామి ఇక్కడ సంస్థానాచార్యులుగా ఉండేవారు. ఆయన వద్ద త్రిదండి శ్రీమన్నారాయణ రామనుజ పెద్ద జీయర్ స్వామి, గోపాలాచార్య స్వామి శిష్యులుగా ఉండేవారు. అప్పట్లో ఇక్కడ ఉన్న వేద పాఠశాలలో పండితులు విద్యనభ్యసించేవారు. 1950 వరకు ఆలయంలో క్రతువులు జరిగేవి. రాజుల పాలన అనంతరం కొన్ని దశాబ్దాల పాటు ఆలయం మూతపడి శిథిలావస్థకు చేరుకుంది. చిన్న జీయరుస్వామి వాసుదేవ ఆలయ చారిత్రక ప్రాముఖ్యతను గుర్తించి తన గురువు స్మారకార్థం జీర్ణోద్ధరణ చేసేందుకు సంకల్పించి 2001 నుంచి పునఃనిర్మాణ పనులను చేపట్టారు. 2009లో ఆలయాన్ని పునఃప్రతిష్ఠించారు. ఆలయంలో రాజుల పాలన కాలంలో ఉన్న విగ్రహాన్నే పునఃప్రతిష్ఠించారు. ఆలయంలో ఉన్న వాసుదేవ పెరుమాళ్ విగ్రహ నిజరూపం తిరుపతిలో ఉన్న వెంకటేశ్వరస్వామి విగ్రహం మాదిరిగానే ఉంటుంది.

బ్రహ్మోత్సవ కార్యక్రమ వివరాలు

- ఈ నెల 17వ తేదీ సోమవారం ఆంజనేయ స్వామి అభిషేకం.
- 18న శ్రీవాసుదేవ పెరుమాళ్ అభిషేకం, శ్రీవిశ్వక్సేన ఆరాధన, అంకురారోపణం.
- 19న గరుడపూజ, ధ్వజారోహణం, హనుమద్వాహనం, శేషవాహన సేవ.
- 20న కల్పవృక్ష వాహనము, ఎదుర్కోలు ఉత్సవం.
- 21న శ్రీ వాసుదేవ్ పెరుమాళ్లు కల్యాణ మహోత్సవం, గరుడవాహన సేవ.
- 22న పొన్నచెట్టు వాహనము, తెప్పోత్సవం , అశ్వవాహనము
- 23న రథోత్సవ, చక్రస్నానం, ద్వాదశ రాధన, శ్రీపుష్పయాగం.

● ప్రసవ వేదన

వజ్రపుకొత్తూరు ఆలివ్‌రిడ్లే తాబేళ్లకు సురక్షిత ప్రాంతమని అంటారు. కానీ ఇప్పుడు ఆలివ్ రిడ్లేలు గుడ్లు పెట్టే సమయాన మృత్యు కౌగిలిలో చిక్కి విలవిలలాడుతున్నాయి. గుడ్లను సేకరించి హేచరీలు నిర్వహించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ఇలా రక్తపు మడుగుల్లో గుడ్లు పెడుతూ ప్రాణాలు వదిలేస్తున్నాయి. ఇటీవల వలకు చిక్కుకుని ఓ ఆలివ్‌రిడ్లే తాబేలు రక్తపు మడుగులోనే గుడ్లు పెట్టి మృత్యువాత పడింది.

- వజ్రపుకొత్తూరు



ఇంటర్ పరీక్షలకు పూర్తి ఏర్పాట్లు చేయాలి

శ్రీకాకుళం: మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఆదివారం జిల్లా ఇంటర్మీడియెట్ అధికారులతో ఆర్ట్స్ కళాశాలలోని ప్రాంగణంలో గల ఆర్‌ఐఓ కార్యాలయంలో జిల్లా పర్యవేక్షణ అధికారి, పరీక్ష కమిటీ సభ్యులు, ప్రిన్సిపాళ్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలతో ఆయన సమావేశం నిర్వహించారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు ఉండాలన్నారు. జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.దుర్గారావు మాట్లాడుతూ మొదటి, రెండో సంవత్సర విద్యార్థులకు 75 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మొదటి ఏడాది 20,389 మంది, రెండో ఏడాదికి 19,967 మంది పరీక్ష రాస్తారని తెలిపారు. పర్యవేక్షణకు 1600 మంది ఇన్విజిలేటర్లు, 1480 సీసీ కెమెరాలు అమర్చుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షా కమిటీ సభ్యులు భీమేశ్వరరావు, నారాయణరావు, సింహాచలం, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదికూర్మ క్షేత్రానికి పోటెత్తిన భక్తులు



ఆలయంలో భక్తుల సందడి

గార: ఆది కూర్మక్షేత్రం శ్రీకూర్మనాథాలయానికి మాఘమాసం ఆదివారం భక్తులు పోటెత్తారు. మండలంలో ఇంకో పక్క రాజమ్మ తల్లి యాత్ర జరుగుతుండగా, అరసవల్లి ఆదిత్యాలయానికి వచ్చిన భక్తులందరూ శ్రీకూర్మనాథుడిని దర్శించి తరించారు. అమరావతి హైకోర్టు నుంచి ఒక న్యాయమూర్తి, హైకోర్టు ఉద్యోగులు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వెనుక వైపున భోజన శాల, మరోవైపు బాత్‌రూమ్‌లు ఏర్పాటు చేసినా కొందరు భక్తులకు తెలియక ఇబ్బందులు పడ్డారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

- 27న జరిగే ఎన్నికలకు సిబ్బంది నియామకం
- 18న తొలి విడత శిక్షణ తరగతులు
- 25 వేల బ్యాలెట్ పత్రాల తయారీ

మహారాణిపేట: ఈ నెల 27న జరగనున్న ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేందిరప్రసాద్ సారథ్యంలో జిల్లా రెవెన్యూ అధికారి భవానీశంకర్ ఏర్పాట్లు చేస్తున్నారు. పది మంది అభ్యర్థు లు తుది ఎన్నికల బరిలో నిలిచారు. అభ్యర్థుల పేరుతో తెలుగులో బ్యాలెట్ పత్రం రూపొందించి, ప్రింటింగ్ కోసం కర్నూలు ప్రభుత్వ ముద్రణాలయానికి పంపారు.

అక్షర క్రమంలో బ్యాలెట్ పత్రం


అభ్యర్థులు నామినేషన్‌లో పేర్కొన్న మేరకు తొలి అక్షరం ఆధారంగా తెలుగు అక్షర క్రమంలో బ్యాలెట్ పత్రం నమూనాను తయారు చేశారు. తుది జాబితా మేరకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారు. వీరికి అదనంగా మరో పది శాతం కలిపి సుమారు 25 వేల బ్యాలెట్ పత్రాలను ముద్రిస్తున్నారు. ఇవి ఈ నెల 18, 19 తేదీల్లో విశాఖ చేరుకునే అవకాశం ఉంది. ఎన్నికల తేదీకి రెండు రోజులు ముందు వాటిని బందోబస్తు నడుమ పోలింగ్ కేంద్రాలకు తరలించనున్నారు.

18 నుంచి తొలి విడత శిక్షణ

ఎన్నికల నిర్వహణ కోసం ఈ నెల 18 నుంచి సిబ్బందికి, ఎన్నికల అధికారులకు శిక్షణ ఇవ్వనున్నారు. రెండో విడత శిక్షణ 24న ఉంటుంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 123 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరపనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి(పీఓ)తోపాటు ముగ్గురు సిబ్బంది అవసరం. మొత్తం 492 మంది సిబ్బందితోపాటు అదనంగా మరో పది శాతం మందిని ఎన్నికల నిర్వహణకు సిద్ధం చేస్తున్నారు.

ఆదాయానికి మద్యమే మార్గమంటూ..

- గ్రామాలకు డోర్ డెలివరీ చేస్తున్న టీడీపీ నాయకుడు
- కపాసుకుద్ది కేంద్రంగా బెల్టులకు మద్యం సరఫరా
- మత్స్యకార గ్రామాలకు అధికంగా మద్యం పంపిణీ



ఇచ్ఛాపురం రూరల్: కొత్త మద్యం పాలసీతో తెలుగు తమ్ముళ్లు జేబులు నింపుకుంటున్నారు. గ్రామాలకు అక్రమంగా మద్యం తరలిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. కవిటి మండలం మత్స్యకార గ్రామానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ఇలా మద్యం సరఫరా చేసిన వైనం వెలుగు చూడడంతో అతను ప్రస్తుతం పరారైపోయాడు. ఈ నాయకుడు ప్రస్తుతం మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా, రేషన్ షాపు డీలర్ ప్రతినిధిగా పరపతి సంపాదించాడు. తన వ్యాపారానికి కవిటి మండలం కపాసుకుద్ది కేంద్రంగా చేసుకుని ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి కపాసుకుద్ది, కర్రివారిపాలెం, ఇద్దివానిపాలెం, బెజ్జిపుట్టుగ, బొరివంక, కుసుంపురం, బల్లిపుట్టుగ వరకు బెల్టు షాపులను ఎంచుకొని ఇచ్ఛాపురం మండలం కొశాలీ వైన్ షాపుల వద్ద నుంచి రాత్రి సమయాల్లో సరుకును తీసుకొని పై గ్రామాలకు డోర్ డెలివరీ చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. బుధవారం ఇచ్ఛాపురం రూరల్ పోలీసులకు సుమారు రెండు లక్షల రూపాయల మద్యం దొరకడంతో.. సరుకును తీసుకువెళ్తున్న వ్యాను డ్రైవర్ ఈ 'బాబు' బండారాన్ని బయట పెట్టేశాడు. దీంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ నేత పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

గ్రామానికో రేటు..

గ్రామాల్లో బెల్టు షాపును నిర్వహించేందుకు గ్రామానికో రేటును ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. మత్స్యకార గ్రామాల్లో రెండేసి బెల్టు షాపులు చొప్పున ఏర్పాటు చేసి ఒక్కో బెల్టు షాపు నుంచి గ్రామానికి రూ.30వేల నుంచి రూ.50 వేల వరకు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఒక రేటు, ఎక్సైజ్ శాఖ స్టేషన్‌కు ఒక రేటును నెలవారీ మామూళ్లుగా ఫిక్స్ చేసినట్లు సమాచారం

పాన్ షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లే అడ్డా..

గత ప్రభుత్వంలో ఎక్కడా బెల్టు షాపుల ఊసే లేదు. ఒకవేళ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులు, సెబ్ అధికారులు దాడులు చేసి నిర్వాహకులపై కేసులు నమోదు చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామాల్లోని పాన్‌షాపులు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఏకంగా మినీ బార్‌లుగా మార్చేశారు. ఇక్కడ బెల్టు షాపులు నిర్వహిస్తూ రోజంతా మందుబాబులకు సరుకు అందిస్తున్నారు. బెల్టు షాపు నిర్వాహకులు క్వార్టర్ బాటిల్‌కు రూ.50 అదనంగా తీసుకుంటున్నారు. ఈ బెల్టుషాపులు అధికార పార్టీ నేతల కనుసన్నల్లో నిర్వహిస్తున్నారన్నది బహిరంగ రహస్యం.



బెల్టుషాపుల వద్ద మద్యం తాగి మత్తులో ఉన్న యువకులు



← పాన్ షాపుల వద్ద బహిరంగంగా మద్యం తాగుతున్న మందుబాబులు

అక్రమ విక్రయాలపై చర్యలు తీసుకుంటాం



అక్రమంగా బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటాం. సిబ్బందితో ముమ్మరంగా దాడులు చేయించి ఇప్పటికే అరెస్టులు, కేసులు నమోదు చేయడం జరిగింది. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించడం నేరం. వైన్ షాపులు బెల్టు షాపులకు మద్యం విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేస్తాం.

– పి.దుర్గాప్రసాద్, సీఐ, ఎక్సైజ్ శాఖ, ఇచ్ఛాపురం

క్లుప్తంగా

వ్యక్తి ఆత్మహత్య

ఇచ్ఛాపురం రూరల్: మద్యానికి బానిసైన వ్యక్తి గెడ్డలో పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇచ్ఛాపురం మండలంలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురం గ్రామానికి చెందిన పైల నూకయ్య(58) మద్యానికి బానిసయ్యాడు. శారీరక సమస్యలతో బాధపడుతూ రెండు రోజుల క్రితం గ్రామానికి కొంత దూరంలో ఉన్న దండుగెడ్డలో పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం శవమై తేలడంతో స్థానికుల సమాచారంతో పోలీసులు బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి తరలించారు. నూకయ్యకు భార్య, ఇద్దరు కూమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యారంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఏఐఎఫ్ఈఏ చీఫ్ ప్యాట్రన్ కె.సుబ్బారెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.చిరంజీవి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతిభవన్‌లో ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(1938) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అధ్యయన తరగతులు నిర్వహించారు. ఏపీటీఎఫ్ కార్యకర్తలకు ఉపాధ్యాయ ఉద్యమం, సమకాలీన అంశాలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, నూతన విద్యా విధానం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ఉద్యమ తొలి గురువు మార్పు బాలకృష్ణమ్మ చిత్రపటానికి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు చింతాడ దిలీప్ కుమార్, జిల్లా అధ్యక్షుడు బి.రవి, జిల్లా గౌరవ అధ్యక్షులు టెంక చలపతిరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు పట్టివేత

గార: ఉత్తరాంధ్రలో పేరున్న వత్సవలస రాజులమ్మ తల్లి యాత్రలో అనధికార మద్యం వ్యాపారం జోరందుకుంది. శని, ఆదివారాల్లో జరిగిన ఈ యాత్రకు అధిక సంఖ్యలో జనం తరలిరావడంతో అనధికార మద్యం వ్యాపారం జరగ్గా ఎక్సైజ్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఓ వ్యక్తి వద్ద నుంచి 10 బాటిళ్లు, మరొక వ్యక్తి నుంచి 15 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ గోపాలకృష్ణ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్.మహేష్‌బాబు, బి.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓల్డేజ్ హోమ్‌లో గుర్తు తెలియని బాలిక



ఓల్డేజ్ హోమ్‌లో ఉన్న బాలిక

బూర్జ: మండలంలోని పాలవలసలో సహాయ మాత ఓల్డేజ్ హోమ్‌లో గుర్తు తెలియని బాలిక ఉందని, ఈమె వివరాలను గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేయాలని నిర్వాహకులు ఆదివారం బూర్జ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నరసన్నపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ అమ్మాయి గాయపడటంతో స్థానికులు కొందరు శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారని, కాళ్లు విరగడంతో కొన్ని రోజులు అక్కడే ఉంచి చికిత్స అందించారని, ఆమె ఎవరో చెప్పలేని స్థితిలో ఉందని, కనీసం పేరు కూడా చెప్పడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. రిమ్స్ సిబ్బంది 2023 డిసెంబరు 31న ఓల్డేజి హోమ్‌లో చేర్పించారని, ఇంతవరకు బాలిక కోసం కుటుంబ సభ్యులు రాలేదని, వారి వివరాలు కనుక్కోవాలని కోరారు.

రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాశీబుగ్గ: తిరుపతి-పూరీ రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు పలాస రైల్వే ఎస్ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. విశాఖపట్నం వద్ద రైలు ఎక్కిన 40 ఏళ్ల తప్పతాగి ఉన్నాడని, పలాస రైల్వే స్టేషన్ వచ్చేసరికి మృతి చెందినట్లు తోటి ప్రయాణికులు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మృతుడి వివరాలు లభించలేదని, పలాస ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మంచు కురిసే వేళలో..




ఉదయం 7 గంటల సమయంలో విపరీతంగా కురుస్తున్న మంచు



మొక్కజొన్న పంటపై వర్షంలా..



మంచులో ప్రయాణిస్తున్న ప్రజలు



మామిడితోటలో మంచు

మంచు వర్షం మళ్లీ మొదలైంది. నెల రోజులుగా విపరీతంగా కురిసిన మంచు రెండు వారాలుగా తగ్గుముఖం పట్టినా ఆదివారం మరోసారి భారీగా మంచు కురిసింది. ఉదయం తొమ్మిది గంటల వరకు ఇదే పరిస్థితి ఉండటంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. జి.సిగడాం ప్రాంతంలో కురిసిన మంచు దృశ్యాలను ఇక్కడ చూడొచ్చు. – జి.సిగడాం

సర్వీస్ రూల్స్‌కు.. తిలోదకాలు



- జీసీ సంక్షేమశాఖ రూటే సెపరేటు'
- నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు.. ఆపై పదోన్నతులు
- ముడుపులు చెల్లిస్తే అక్రమాలన్నీ సక్రమాలే

శ్రీకాకుళం పాతబస్టాండ్: బీసీ సంక్షేమ శాఖలో సర్వీస్ రూల్స్‌కు తిలోదకాలిస్తున్నారు. ఉన్నతాధికారుల పేరు చెప్పి కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇతర ఏ ప్రభుత్వ శాఖలోనూ లేనివిధంగా ఇక్కడ పదోన్నతుల వ్యవహారం సాగుతోంది. అటెండర్ (ఆఫీస్ సబార్డినేట్)గా విధుల్లోకి చేరిన వారు, కుక్‌గా చేరిన వారు ఒక్క సారిగా మూడు కేడర్లు దాటి వసతి గృహ సంక్షేమాధికారిగా పదోన్నతులు పొందుతున్నారు. కేవలం డిగ్రీ అర్హత ఉంటే చాలు.. ఆ సర్టిఫికెట్ నకిలీదా వాస్తవమైనదా అన్నది పరిశీలించకుండానే పదోన్నతులు కట్టబెట్టేస్తున్నారు. నిబంధనలు తుంగలో తొక్కి ఉన్నతాధికారులకు డబ్బులు చెల్లించి ఉద్యోగాల్లో కొనసాగుతున్న వారు, అడ్డగోలుగా పదోన్నతులు పొందిన కొందరు ఉద్యోగులు విధులకు డుమ్మాకొట్టి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- 2006లో జీఓ 36 ప్రకారం 10 శాతం ప్రమోషన్లు ఇవ్వాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో జారిచేసింది. అప్పటికి అర్హత ఉన్నవారి ప్రకారం 8 మందికి పదోన్నతులు కల్పించాల్సింది. అయితే ఈ జీవోని తుంగలోకి తొక్కి అధికారులే సొంత జీవోను తయారు చేసుకొని కాసులకు కక్కుర్తి పడి ఏకంగా 25 మంది కింది స్థాయి ఉద్యోగులకు వార్డెన్లుగా (హెచ్‌డబ్ల్యూఓ) పదోన్నతులు కల్పించారు. ఈ ఖాళీలు ఎక్కడి నుంచి వచ్చాయో..ఏ జీవో ప్రకారం పదోన్నతుల కల్పించారో వారికే ఎరుక. ఇటువంటి పదోన్నతుల పర్యవసానంగానే గతంతో ఇక్కడ జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన అధికారికి ఇప్పటికీ పెన్షన్ రాలేదు. అంతేకాకుండా ఆ కేసులు కూడా తేలలేదని కార్యాలయ సిబ్బందే చెబుతున్నారు. ఆ తర్వాత డీబీసీడబ్ల్యూఓగా వచ్చి అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారిణికి కూడా కేసుల బెడద తప్పలేదు.
- జీవో ప్రకారం పదోన్నతి పొందిన వారు మూడేళ్లలోపే బీఈడీ పూర్తి చేయాలి. అలా పూర్తి చేయకపోతే తిరిగి సబార్డినేట్ పోస్టుకి వెళ్లాలి. ఇక్కడ మాత్రం పదోన్నతి పొందడమే తప్ప ఆ తర్వాత పట్టించుకునే వారే కరువయ్యారు. ఒక వేళ ఎవరైనా డిగ్రీ సర్టిఫికెట్లు తెచ్చినా అవి నిజమైనవా నకిలీవా అన్న దర్యాప్తు కూడా చేపట్టడం లేదు.
- ఏ ఉద్యోగికైనా పదోన్నతి పొందాక రెండేళ్లలోపు డిపార్ట్‌మెంట్ టెస్టులు రాయాలి. అంటే ఎస్ఓ-1 ఉత్తీర్ణత సాధించాలి. లేదంటే పాత కేడర్‌కే రివర్ట్ చేయాల్సి ఉంది. ఆ నిబంధన కూడా ఈ శాఖలో ఇప్పటి వరకు అమలు కావడం లేదు. ఇటువంటి వాటిని ఆ ఉద్యోగులకు బూచిగా చూపించి కొందరు జిల్లా స్థాయి అధికారులు డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బీసీ సంక్షేమశాఖలో డబ్బులిస్తే చాలు ఉన్నతాధికారులను, ఆపై ఉన్నతాధికారులను తప్పుతోవ పట్టించడంలో కొందరు ఘనాపాటిలు ఈ శాఖలో తిష్ట వేశారు.
- బీసీ సంక్షేమశాఖలో ముఖ్యంగా జోన్-1లో రూల్ 16 హెచ్ నడుస్తుంది. శ్రీకాకుళం జిల్లాలో 2008లో సీనియారిటీ లిస్ట్ ఇచ్చారని, మరలా ఇప్పటివరకు ఇవ్వకపోవడం దారుణమని వార్డెన్లు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పుడు రూల్ 16హెచ్ పక్కను పెట్టి సీనియారిటీ పేరిట కొత్తగా అవినీతి పదోన్నతులు పేరిట ఫైల్‌ను తయారుచేసి మరోసారి కలెక్టర్, ఇతర అధికారులను తప్పుతోవ పెట్టించే ప్రయత్నం ఈ శాఖలో మొదలైందని ఆ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు. తప్పుడు పదోన్నతులు ఇవ్వడం ఈ శాఖకు అలవాటుగా మారిందని ఆ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- సెటిల్డ్ సీనియారిటీ మార్చే అధికారం ఎవరికీ లేదు. 2008లో ఇచ్చిన సెటిల్డ్ సీనియార్టిని ఒక వేళ మార్పు చేయాలంటే మూడేళ్లలోపే మార్చే అధికారం ఉంటుంది. అప్పుడు చేయకుండా ఇప్పుడు మార్చే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.
- లావేరులో పనిచేసిన ఓ అటెండర్ నకిలీ డిగ్రీ సర్టిఫికెట్‌తో వార్డెన్‌గా పదోన్నతి పొందినట్లు ఆ శాఖ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. ఆయనతో పాటు పదోన్నతి పొందిన ఇద్దరు ఉద్యోగ విరమణ పొందినా క్రమశిక్షణ చర్యలు క్రింద పెన్షన్ నిలుపుదల చేశారు. దీనిని బట్టి కొంత మందికే క్రమశిక్షణా చర్యలు, మరికొంతమందికి మినహాయింపులు ఉంటాయనేది అర్థం చేసుకోవచ్చు.
- ప్రధానంగా జిల్లా అధికారికి, కార్యాలయ సిబ్బందికి, అస్మదీయులకు అనుకూలంగా ఫైల్ తయారు చేస్తున్నట్లు సమాచారం. ఇదే జరిగితే నష్టపోయినవారు కోర్టుకు వెళ్లే అవకాశం ఉంది. ఇప్పటికే సమస్యలు, వివాదాలతో కూనరిల్లుతున్న ఈ సంక్షేమ శాఖ మరింత ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుంది. ముఖ్యంగా ఈ శాఖ జిల్లా కార్యాలయంలో అధిక శాతం మంది కారుణ్య నియామకం పొందినవారే. వారికి సర్వీస్ రూల్స్‌పై అవగాహన లేకపోవడం, అధిక వేతనంపై ఆశతో తప్పులమీద తప్పులు చేస్తున్నారని ఆ శాఖలో కొంతమంది ఉద్యోగులు బాహాటంగానే చెబుతున్నారు.

దివ్యాంగ చిన్నారిపై కుక్కల దాడి



గాయపడిన శ్యామల

పొందూరు : పొందూరు పరిధిలోని అలబోయినపేట మంగళకాలనీ సమీపంలో కుక్కలు మూకుమ్మడిగా చేసిన దాడి చేయడంతో ఎనిమిదేళ్ల దివ్యాంగ చిన్నారి సెనగల శ్యామల తీవ్రంగా గాయపడింది. మూగ, చెవిటి సమస్యతో బాధపడుతున్న శ్యామల స్నేహితులతో కలిసి సమీపంలో పెళ్లి విందుకు వెళ్లి వస్తుండగా కుక్కలు దాడి చేశాయి. నాలుగు కుక్కలు వెనుక నుంచి ఒక్కసారిగా అరుస్తూ దూసుకొచ్చాయి. కుక్కల అరుపులకు పిల్లలంతా భయపడి పారిపోగా శ్యామలకు వినిపించకపోవడంతో అక్కడే ఉండిపోయింది. స్నేహితులు ఎందుకు పరుగుపెడుతున్నారో తెలుసుకునే లోగానే నాలుగు కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. కాళ్లు, చేతులు, పొట్టభాగంలో గాయాలయ్యాయి. ఇంతలో అటుగా వస్తున్న గ్రామస్తులు కుక్కలు తరిమి చిన్నారిని కాపాడారు. చిన్నారిని పొందూరు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

నరసన్నపేటలో గంజాయి కలకలం

- 22 కేజీలు స్వాధీనం.. 9 మంది అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ జె.శ్రీనివాసరావు

నరసన్నపేట : నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో గంజాయి వినియోగం ఒక్కసారి బట్టబయలైంది. ఒకేసారి 9 మంది అరెస్టు కావడంతో కలకలం రేగింది. స్థానికంగా గంజాయి అమ్మకాలు, వినియోగం జరుగుతుందని గమనించిన పోలీసులు దీనిపై నిఘా వేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు పలు ప్రాంతాల్లో గంజాయి అక్రమంగా చేతులు మారుతున్నట్లు అనుమానంతో ఇటీవల సోదాలు చేశారు. అప్పట్లో ఏమీ లభించలేదు. శనివారం స్థానిక వెంకటేశ్వరాలయం ఎదురుగా రాజులు చెరువు గట్టుపై ఉన్న వీధిలో పసుపుల రమణ ఇంటి వద్ద కొందరు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. వీరి వద్ద రూ.66 వేల విలువైన 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో కొందరు గంజాయిని వినియోగిస్తున్నారు. వీరిని విచారించగా మిగిలిన వారూ పట్టుబడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసి 9 మంది నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ జె.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. స్థానిక ట్యాంకు బండ్ వీధికి చెందిన కోట ప్రదీప్, శ్రీరాంనగర్‌కు చెందిన లిమ్మా రాహుల్, పెద్దపేటకు చెందిన అరసవల్లి వరప్రసాద్, జగన్నాథపురానికి చెందిన దనిమిశెట్టి అజయ్, హనుమాన్‌నగర్‌కు చెందిన గొడ్డు రాఘవేంద్ర, బొంతల వీధికి చెందిన పొన్నాడ అజయ్, మేదర వీధికి చెందిన బెహరా హరి, శ్రీకాకుళం సానా వీధికి చెందిన తట్టా హేమంత్, పోలాకి గొల్లలవలసకు చెందిన దంత పునీత్‌లను అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు. వీరి వద్ద రెండు ద్విచక్ర వాహనాలు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఉత్తరాంధ్ర మాజీ సైనికుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ కలయికలో పాల్గొన్న సంఘ నాయకులు, మాజీ సైనికులు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని పెద్దరెల్లివీధిలో జిల్లా మాజీ సైనికుల ఫెడరేషన్ అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తరాంధ్ర జిల్లాల మాజీ సైనిక సంక్షేమ సంఘాల నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వన్ స్టేట్ వన్ అసోసియేషన్ రాష్ట్ర అడహాక్ కమిటీ కన్వీనర్ కె.గోవిందరావు, రాష్ట్ర స్థాయి క్రియాశీలక నాయకులు, బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, రాజమండ్రికి చెందిన సీనియర్ మాజీ సైనికులు, న్యాయవాది డాక్టర్ సూరెడ్డి శివకుమార్ హాజరయ్యారు. మాజీ సైనికుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తున్నామని, సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల మాజీ సైనికుల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో మాఘమాస సందడి



ఆదిత్యుని సన్నిధిలో భక్తుల రద్దీ



సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు



పుష్కరిణి ఒడ్డున పిడకల పొయ్యిలపై క్షీరాన్నం వండుతున్న మహిళలు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మాఘమాస సందడి నెలకొంది. మాఘ మాసం రెండో ఆదివారం సందర్భంగా ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ఇతర జిల్లాల నుంచి సైతం భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఇంద్రపుష్కరిణి వద్ద పిడకల పొయ్యిలపై క్షీరాన్నాన్ని వండి ఆదిత్యునికి నివేదించారు. తలనీలాల మొక్కులు తీర్చుకుని ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాల పూజలు చేయించుకున్నారు. ఆలయంలో స్వామివారి మూలవిరాట్టును ప్రత్యేకంగా అలంకరించి వేకువజామున 6 గంటల నుంచే ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో సర్వదర్శనాలకు సిద్ధం చేశారు. భక్తులకు ఎండ వేడి నుంచి రక్షణగా ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో దర్శన మార్గాల్లో టెంట్లు వేయించారు.మంచినీటిని సరఫరా చేయించారు. మరుగుదొడ్ల విషయంలో మాత్రం భక్తులు అవస్థలు పడ్డారు. పలువురు అధికారులు ఆదిత్యున్ని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శనానికి రావడంతో వివిధ దర్శన టికెట్ల విక్రయాల ద్వారా రూ.8.15 లక్షలు, విరాళాలు, ప్రత్యేక పూజలు టికెట్ల విక్రయాల ద్వారా రూ.1,08,740, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 2.25 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈవో ప్రకటించారు.

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో

నరసన్నపేట: జాతీయ రహదారిపై దేవాది సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ఆటో బోల్తా పడిన ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. అతివేగంతో వస్తున్న ఆటో పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి అదుపుతప్పడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు స్పందించి క్షతగాత్రులను బయటకు తీశారు. ఆర్. ఈశ్వరమ్మ, కొండాలమ్మ, పైడమ్మలకు బలమైన గాయాలు కాగా, మిగిలిన ముగ్గురూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎచ్చెర్ల మండలం సనపలవానిపేటకు చెందిన వీరంతా ఆటోలో నిమ్మాడ వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. గాయపడిన వారిని ఎన్‌హెచ్ అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఎన్‌హెచ్ పెట్రోలింగ్ పోలీసులు సకాలంలో స్పందించి తగిన సహాయం అందించారు.

కారులో మంటలు

- కుటుంబానికి తప్పిన పెను ప్రమాదం

టెక్కలి: మండలంలోని నరసింగపల్లి సమీపంలో ఆదివారం ఓ కారు నుంచి హఠాత్తుగా మంటలు రావడంతో యజమాని గమనించి అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. టెక్కలి మండలం సీతాపురం గ్రామానికి చెందిన బెండి ఉదయ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కారులో పర్లాఖిమిడి వైపు వెళ్తుండగా, నరసింగపల్లి సమీపంలో రోడ్డుపై వేసిన మినుము మొక్కలు ఇంజిన్‌లోకి వెళ్లి రాపిడికి మంటలు వ్యాపించాయి. ముందుగా పొగలు రావడంతో గమనించిన ఉదయ్ ఒక్కసారిగా అప్రమత్తమై కారును నిలిపివేసి హుటాహుటినా కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం గ్రామస్తుల సాయంతో మంటలపై నీరు చల్లడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కారు ఇంజిన్, అడుగు భాగం దెబ్బతింది.

డీఎస్సీ-2003 టీచర్లకు పాతపెన్షన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న డీఎస్సీ-2003 టీచర్స్ ఫోరం జిల్లా కన్వీనర్ పి.శ్రీహరి

శ్రీకాకుళం అర్బన్:

డీఎస్సీ-2003 ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డీఎస్సీ-2003 ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఫోరం ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ వెలువడిన 2003 సమయంలో సీఎంగా చంద్రబాబునాయుడే ఉన్నారని.. ఆరోజు నియామకాల జాప్యానికి నాటి ప్రభుత్వాలే కారణమని చెప్పారు. ప్రభుత్వ జాప్యానికి ఉపాధ్యాయులను బలిపశువులను చేయడం తగదని.. పాతపెన్షన్‌ను అమలు చేయకుటే ఉద్యమబాట పడతామని ఫోరం ప్రతినిధులు స్పష్టంచేశారు. శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న కళింగభవన్‌లో డీఎస్సీ 2003 ఉత్తరాంధ్ర ఫోరం ఆధ్వర్యంలో మెమో 57 ఉద్యోగ ఉపాధ్యాయ సాధన సమితి సమావేశం జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర కన్వీనర్ మోపిదేవి శివశంకర్ మాట్లాడుతూ డీఎస్సీ నోటిఫికేషన్ 2003 నవంబర్ 13న విడుదలైనప్పటికీ నియామకాలు 2005 నవంబర్లో చేపట్టి.. రెండేళ్లపాటు ప్రభుత్వం జాప్యం చేసిందని, తమను బలవంతంగా సీపీఎస్ విధానంలోకి నెట్టడం సరికాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నియమితులైన 7361 మంది ఉపాధ్యాయులకు, హోంశాఖ కు చెందిన 1800 మంది కానిస్టేబుళ్లకు, గ్రూప్-2, గ్రూప్-1, హెల్త్ విభాగానికి చెందిన 1800 మందికి మొత్తం 11,000 మంది ఉపాధ్యాయ ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు సైతం వర్తింపచేసి పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఎన్జీవో సంఘ అధ్యక్షుడు హనుమంతు సాయిరాం మాట్లాడుతూ ఇది ఆర్థిక భారమైన డిమాండ్ కాదని.. న్యాయబద్ధమైన సమస్యలను ప్రభుత్వమే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం మెమో 57 ప్రకారం పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని దానికి అవసరమైన అన్ని రకాల సహకారం ఏపీ ఎన్జీవో సంఘం తరపున అందిస్తామన్నారు. ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు దుప్పల శివరాంప్రసాద్ మాట్లాడుతూ మెమో 57 ప్రకారం 15 రాష్ట్రాలు పాత పెన్షన్ విధానం అమలు చేశాయన్నారు. ఇక్కడ అమలు చేసి 16వ రాష్ట్రంగా నిలవాలని కోరారు. ఫోరం జిల్లా కన్వీనర్ పి.శ్రీహరి మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు ఫ్యామిలీ పెన్షన్, గ్రాట్యుటీ అమలు చేసిన తొలి రాష్ట్రంగా మన రాష్ట్రం నిలవాలన్నారు. సమావేశంలో సుబ్బారెడ్డి, విజయనగరం కన్వీనర్ రవి, విశాఖ కన్వీనర్ షేక్ మహ్మద్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు గాదె శ్రీనివాసులునాయుడు, కోరేడ్ల విజయ్‌గౌరి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన వెటర్నరీ సిబ్బంది



మంత్రికి సమస్య వివరిస్తున్న సిబ్బంది

కాశీబుగ్గ: తమను ఉద్యోగాల్లో కొనసాగించాలని కోరుతూ వెటర్నరీ(1962) వాహనం సిబ్బంది ఆదివారం నిమ్మాడలో మంత్రి అచ్చెన్నాయుడిని కలిశారు. అకస్మాత్తుగా తమను ఉద్యోగాల నుంచి తొలగించడం భావ్యం కాదన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెటర్నరీ వాహనాల నిర్వహణ అవకతవకలు ఉన్నట్లు గుర్తించామని, 104లా చిన్న వాహనం పెట్టేందుకు ఆలోచిస్తున్నామని, జీవీకే సంస్థకు రూ. 150 కోట్ల బకాయి ఉందని తెలియజేశారు. ఈ సమస్యలన్నీ తేలాక మళ్లీ పిలుస్తామని హామీ ఇచ్చారు. కాగా, ముందస్తు సమాచారం లేకుండా ఉద్యోగులను తొలగించడం అన్యాయమని, ఉద్యోగుల కోసం నిరహార దీక్షలు చేస్తామని సీఐటీయూ అధ్యక్షుడు సురేష్ బాబు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వైఎస్సార్ సీపీ నాయకుడు మృతి



రంగాల కృష్ణారెడ్డి (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: బంధువుల వివాహ వేడుకకు హాజరై తిరిగి ఇంటికి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మృతి చెందారు. అరకబద్ర గ్రామానికి చెందిన రంగాల కృష్ణారెడ్డి(63) ఆదివారం ధర్మపురం బంధువుల ఇంట్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరయ్యారు. అక్కడి నుంచి మధ్యాహ్నం ఇంటికి తన ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా, ధర్మపురం-ఈదుపురం రోడ్డులో వెళ్తున్న ట్రాక్టర్ బలంగా ఢీ కొట్టింది. పంట పొలాల్లో పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఈయనకు భార్య సీతమ్మ, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు. రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి తరలించారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి అంకిత భావంతో పనిచేసిన కృష్ణారెడ్డి మృతి పట్ల జెడ్పీ ఛైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంపత్ని చిట్టిబాబు, నాయకులు సంతాపం తెలియజేశారు.